క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు

అమడగూరు: ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటనారాయణ హెచ్చరించారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌తో కలిసి మహమ్మదాబాద్ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు డీడీలు చెల్లించి అనుమతి పత్రాన్ని పొందిన తర్వాత ఇసుకను రవాణా చేసుకోవాలన్నారు.

శ్రీశైలానికి అదనపు బస్సు సర్వీసులు

కదిరి అర్బన్: మాఘమాసం సందర్భంగా కదిరి ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి ఈనెల 30వ తేదీ నుంచి అదనపు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం మైనుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సులు రోజూ కదిరిలో ఉదయం 7, రాత్రి 8 గంటలకు బయలు దేరుతాయన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా భక్తుల దర్శనానికి రూ.500, అతి శీఘ్ర దర్శనానికి రూ.300, శీఘ్ర దర్శనానికి రూ.150 ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959225892 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

గుజరీ దుకాణం పరిశీలన

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గుజరీ దుకాణాన్ని శుక్రవారం తహసీల్దార్ నటరాజ్, ఆర్‌ఐ మున్వర్ పరిశీలించారు. ఈనెల 26న గుజరీ దుకాణంలో కంప్రెషర్ పగిలి బీహార్‌కు చెందిన సుభాష్ అనే కూలి మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలైన విషయం తెలిసిందే. ప్రమాద ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే గుజరీ దుకాణాన్ని బాంబ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం గౌతమి అనే ప్రయాణికురాలు సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఆ ఫోన్ కంట్రోలర్ ఉత్తన్నకు దొరకడంతో బస్టాండ్‌లో సెల్‌ఫోన్ వెతుకుతున్న గౌతమిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమెకు ఫోన్ అప్పగించి నిజాయితీ చాటుకున్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చండ్రాయునిపల్లిలో శ్మశాన వాటిక స్థల సమస్యను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరిష్కరించారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కావాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను గురువారం కోరారు. 24 గంటలు గడవక ముందే ఎమ్మెల్యే ఆదేశాలతో శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి సిద్దరాంపుర కేశప్ప, సర్పంచ్ రమణయ్య, రెవెన్యూ సిబ్బంది గ్రామ సమీపంలోని స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ 711లో ఎకరా 90 సెంట్ల స్థలాన్ని గుర్తించి శ్మశాన వాటికకు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొజ్జప్ప, కేశప్ప,రామకృష్ణ, సి.కేశప్ప, ఈశ్వరయ్య, గోపాల్ తదిరులు పాల్గొన్నారు.

విద్యుత్ డెకరేషన్‌కు కొటేషన్ల ఆహ్వానం

తాడిమర్రి: చిల్లవారిపల్లి కాటికోటేశ్వర క్షేత్రంలో సున్నం పూతలు, విద్యుత్ డెకరేషన్, సప్లయర్స్ సామగ్రిని సరఫరా చేసేందుకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు గ్రామ కమిటీ ధర్మకర్త గంగిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీలోపు కొటేషన్ పత్రాలు ఆలయంలో అందజేయాలని కోరారు.

వైభవంగా సుబ్రహ్మణేశ్వర షష్టి



అలంకరణలో సుబ్రమణ్యేశ్వరుడు

రామగిరి: మాఘశుద్ధ షష్టి సందర్భంగా పేరూరులో శుక్రవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయమే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు నిర్వహించారు. సమీప ప్రాంతాల ప్రజలు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

రుణాలు మాఫీ చేయాలి

తాడిమర్రి: రైతులకు సంబంధించిన పంట రుణాలు, బంగారు తాకట్టు రుణాలను మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు జంగాలపల్లి పెద్దన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, రైతు కార్మికుల వ్యతిరేక చర్యలకు నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

హౌసింగ్ బిల్లు రూ.5 లక్షలకు పెంచాలి

కనగానపల్లి: పేదల ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసే హౌసింగ్ బిల్లును రూ.ఐదు లక్షలకు పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఐ నాయకులతో కలిసి కనగానపల్లిలోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందని, ఆ మొత్తం సరిపోక లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.



ఎనుములపల్లి వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

వలసలకు స్వస్తి.. ఊళ్లోనే ఉపాధి

ప్రకృతి కరుణించడంతో గత మూడేళ్లుగా వర్షాలు విస్తారంగా కురిశాయి. భూగర్భ జలాలు పెరగడంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలోని 32 మండలాల్లో ఏడాది పొడవునా వ్యవసాయ పనులు ఉండటంతో వలసలు తగ్గిపోయాయి. పంట వేయడం, కలుపు తీయడం, పంట తొలగించడం, పూలు కోయడం, వరి నాట్లు వేయడం, అందులో కలుపు తొలగించడం, నూర్పిడి, ఇక ఉద్యాన పంటల్లో కాయలు తొలగించడం, మందులు చల్లడం వంటి పనులతో కూలీలకు ఉన్న ఊళ్లలోనే ఉపాధి దొరుకుతోంది. అలాగే ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకంలో పనులు కల్పిస్తుండటంతో బెంగళూరు, హైదరాబాద్‌కు వలస వెళ్లిన కూలీలు స్వగ్రామాలకు తిరిగొచ్చారు. ఓ వైపు వ్యవసాయ పనులు, ఉపాధి పనులకు వెళ్తూ ఏడాదంతా బిజీగా గడుపుతున్నారు. – పుట్టపర్తి అర్బన్:



ఏకప్పలబండ వద్ద పూలు కోస్తున్న దృశ్యం



నిడిమామిడి వద్ద వేరుశనగ విత్తనాలు నూర్పిడి చేస్తున్న స్థానికులు

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో శుక్రవారం మహంకాళమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో పెద్దమ్మ దేవత విగ్రహ ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన వడుగూరు లక్ష్మీనారాయణను, ఆయన సోదరులను ఆలయ కమిటీ సభ్యులు, అభినందించారు.

లారీని ఢీకొని వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన లక్ష్మిరెడ్డి

ఓడీ చెరువు: మండలంలోని గౌనిపల్లి సమీపంలో కదిరి–హిందూపురం రహదారిపై శుక్రవారం రాత్రి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పగడాలవారిపల్లికి చెందిన లక్ష్మిరెడ్డి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం 108లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదాల నివారణలో డ్రైవర్ల బాధ్యత కీలకం



సిబ్బందికి సూచనలిస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: డ్రైవర్లు బాధ్యతగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునని జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ఆయా డిపోల్లో భద్రతా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెదటి రోజు డ్రైవర్లకు అవగాహన, 28న శిక్షణ తరగతులు, 29న వాహనాల మరమ్మతులపై అవగాహన, 30న డ్రైవర్లకు ఆరోగ్య పరిరక్షణ, 31న కౌన్సిలింగ్, ఫిబ్రవరి 1న రక్తదానం, 2న డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా డ్రైవర్లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ శిక్షణాలో ఉన్నతస్థాయి పోలీసు, వైద్యాధికారులు పాల్గొంటారన్నారు. ప్రతి డిపో లోనూ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించాలని డిపో మేనేజర్లకు తెలియజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బత్తలపల్లి: ధ్యానంతోనే ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని 108 సంవత్సరాల వయస్సు కలిగిన హిమాలయ యోగి సత్‌సదానంద గిరి మహరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక కల్యాణం, అహింస, సర్వజనుల శ్రేయస్సు కోసం పర్యటిస్తున్నట్లు తెలిపారు. ధ్యాన మందిరంలో ధ్యానులకు ధ్యానసేవా, ధ్యాన ప్రచారంపై అద్భుతమైన సందేశం ఇచ్చారు. ఈ జీవితం అనేది నాటకం, మూనాల ముచ్చటే శరీరం ఉన్నప్పుడే మనం ఏదైనా గాని ఈ లోకానికి మేలు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ సహాయం, సేవ చేస్తూ ఉండాలన్నారు. సకల జీవరాశి భగవంతుడే, సకల ప్రాణుల్లోనూ భగవంతుడే ఉన్నారన్నారు. ప్రాణమే భగవంతుడన్నారు. గాంధీ మహాత్ముడు చెప్పినట్లు అహింసా పరమో ధర్మః అనే ఉద్దేశంతో ఏ ప్రాణిని హింసించకూడదన్నారు. కార్యక్రమంలో గుంటూరు వెలగపూడి లక్ష్మణరావు, ధ్యానం మాస్టర్లు నాగేంద్ర, కొండన్న, సప్లయర్స్ నాయుడు, అక్కులప్ప, సరోజమ్మ, వన్నూరప్ప, రాప్తాడు పాండు, ద్రాక్షాయణి, మగ్గం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కాగిత రహిత సేవలు

ధర్మవరం: ఈ–ఆఫీస్ సర్వీస్ ద్వారా మున్సిపల్ కార్యాలయ పనులను మరింత వేగవంతం చేస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి ఈ–ఆఫీస్ సర్వీస్‌పై అవగాహన కల్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎన్‌ఐసీ కలెక్టరేట్ టెక్నికల్ అసోసియేట్ రవికృష్ణ ద్వారా ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో ప్రజలకు సేవలు అందించే వివిధ విభాగాల్లోని వివరాలను కంప్యూటర్‌లో ఇప్పటికే నమోదు చేయడం జరిగిందన్నారు. మరింత నైపుణ్యంతో ముందుకు వెళ్లడానికి కార్యాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పేపర్ లెస్ (కాగిత రహిత) సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఆనంద్, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ విభాగం ఈఈ సత్యనారాయణ, టీపీఓ రెహమాన్

హజ్రత్ సయ్యద్ షా బాబాషరుద్దీన్ దర్గాలో ప్రార్థనలు





ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి. చాదర్ తీసుకెళ్తున్న పూల శ్రీనివాసులు రెడ్డి, బత్తల హరిప్రసాద్

తలుపుల: స్థానిక కుమ్మర పేటలోని హజ్రత్ సయ్యద్ షా బాబాషరుద్దీన్ దర్గాలో శుక్రవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. తొలుత ఎంపీపీ రఫీ నాయక్, మాజీ సర్పంచ్ ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పూల చాదర్ సమర్పించారు. చెక్కర చదివింపులు చేయించారు. బాబాషర్ఫుద్దీన్ ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ క్రాంతికుమార్, ఉప సర్పంచ్ డిక్‌బాబు రూరల్ సీఐ శివశంకర్ నాయక్, ఎస్‌ఐ మగ్బుల్ బాషా, మాజీ సర్పంచ్‌లు నరసింహారెడ్డి, సర్పంచ్‌లు శ్రీరామ్‌రెడ్డి, వెంకటపతినాయుడు, టోపీరమణ, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, మౌలా, గంగరాజు, ఉసేన్ మియా, రమేష్, వలి పాల్గొన్నారు. బాబా షర్ఫోద్దీన్ ఉరుసులో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ పాల్గొన్నారు. దర్గా కమిటీ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ప్రార్థనలు చేశారు.

పుట్టపర్తికి చేరిన రైతు పర్తియాత్ర





కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు, పల్లె పిలుస్తోంది రా నృత్య రూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: రైతాంగం ప్రాముఖ్యతను చాటుతూ ఖమ్మం జిల్లా భక్తులు నగరసంకీర్తన నిర్వహించారు. రైతు పర్తియాత్ర పేరుతో వందలాది సత్యసాయి భక్తులు ఖమ్మం నుంచి శుక్రవారం పుట్టపర్తికి చేరుకున్నారు. పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి ప్రశాంతి నిలయం తూర్పు గేటు వరకూ నగర సంకీర్తన చేపట్టారు. పండితులు వేదపఠనంతో ముందుకు సాగారు. భక్తులు కోలాటం, చక్కభజనలు, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే నృత్యాలు, రైతాంగం ప్రాముఖ్యతను వివరించే ఫ్లకార్డుల ప్రదర్శనతో నగర సంకీర్తన ముందుకు సాగింది. వృక్షాలు మానవాళి మనుగడకు తోడ్పడుతున్న తీరును వివరించారు. వ్యవసాయం, హైందవ సంప్రదాయంలో గోపూజ ప్రాముఖ్యతను చక్కగా వివరించారు. సత్యసాయి, షిర్డీ సాయి వేషధారణలో ఆధ్యాత్మిక బోధనలతో నగర సంకీర్తన సాగింది. పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అంతకుముందు ఖమ్మం జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్ సత్యసాయి ట్రస్ట్ ద్వారా ద్వారా ప్రజలకు అందుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు.

ఆరుగురు బైండోవర్

అమడగూరు: మండలంలోని హరిపురం గ్రామంలో ఇటీవల జరిగిన భూ తగాదాలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురిని శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఎదుట హాజరుపర్చినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. ఈ ఆరుగురు ఇకపై భూ తగాదాలో గొడవలకు పాల్పడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

నేడు రథసప్తమి వేడుకలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసెట్టి సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకేరోజు ఏడు వాహనాల్లో లక్ష్మీ చెన్నకేశవస్వామి పురవీధుల్లో ఊరేగుతారన్నారు.

ప్రత్యేక తరగతులకు విరామం ఇవ్వాలి

పుట్టపర్తి: 10వ తరగతి విద్యార్థులకు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు విరామం ఇవ్వాలని వైఎస్సార్‌టీఎఫ్, పీఆర్‌టీయూ నేతలు శుక్రవారం బుక్కపట్నం డైట్‌లో ఆర్జేడీ ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆర్జేడీ శని, ఆదివారాల్లో ప్రత్యేక తరగతులకు విరామం ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతో ప్రయోజనాలు

పుట్టపర్తి టౌన్: భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర కార్మికులు గుర్తింపు కార్డులు పొందితే ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని అసిస్టెంట్ లేబర్ అధికారి నరేష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు, మట్టి పనివారు, పునాదులు గంతలు తీసేవారు, తాపీ కూలీలు, రాడ్ బ్రెడ్డింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, సెంట్రింగ్ పనివారు, బండలు కొట్టేవారు, గ్రానైట్, టైల్స్, పాలీస్ పనివారు, బండలు కొట్టువారు, ఇటుకలు తయారు చేసుకునే వారు బావులు చెరువులు తవ్వే వారు, క్రేన్ ఆపరేటర్లు, క్వారీ కార్మికులు తదితరులు గుర్తింపు కార్డులు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేసుకునేందుకు 18 నుంచి 60 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ఇందులో నమోదైన వారికి పథకాలు అందుతున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు లేబర్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శుభకార్యం

అమడగూరు: మండలంలోని జౌకల గ్రామంలో శుక్రవారం నాగేంద్ర, సాయికుమారిల వివాహం జరిగింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డితో కలిసి వివాహానికి హాజరైన హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ఆదినారాయణ, సొసైటీ అధ్యక్షుడు బొట్టుస్వామి, నాయకులు నాగరాజు, గంగాద్రి, రంగారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

'ఇక నుంచి పథకాలు అందుతాయి'



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

తాడిమర్రి: మర్రిమాకులపల్లి గ్రామ ప్రజలకు ఇక నుంచి సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. సీబీఆర్‌లో ముంపుకు గురై, మరో ప్రాంతంలో నూతనంగా నిర్మించిన మర్రిమాకులపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె తహసీల్దార్ నాగరాజుతో కలసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మర్రిమాకులపల్లి పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో ప్రభుత్వ రికార్డుల్లో తొలగించడం, గ్రామ పంచాయతీ రద్దు అయ్యిందన్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఆగిపోయారన్నారు. గ్రామాన్ని తిరిగి పునర్నిర్మాణం చేయడంతో పంచాయతీ చట్టం ప్రకారం తిరిగి గ్రామాన్ని రికార్డుల్లో చేర్చినట్లు తెలిపారు. అయితే నూతనంగా ఏర్పడిన గ్రామానికి గ్రామస్తుల ఏకాభిప్రాయంతో ఏ పేరైన పెట్టుకునే అవకాశం ఉందన్నారు. మర్రిమాకులపల్లి పేరే కొనసాగించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. దీంతో అధికారులు ప్రజాభిష్టం మేరకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కామాక్షి, ఏపీఓ సంజీవరెడ్డి, డీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వీఆర్‌ఓ చరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.నరసింహారెడ్డి, ఎం.ప్రభాకర్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత



రిటైర్డ్ రిజిస్ట్రార్ రామకృష్ణారెడ్డి, డీఎస్పీ హుసేన్‌పీరాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ధర్మవరం: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిత ఉందని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి బంగారు భవిష్యత్తు కోసం అడుగులు వేయాలని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్‌లో 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శంకరనారాయణ, డీఎస్పీ హుసేన్‌పీరా, ఎస్కే యూనివర్సిటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. గతేడాది పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్య సభ్యులు డైరెక్టర్ రవీంద్ర, కరస్పాండెంట్ మల్లికార్జున తదితరులు జ్ఞాపికలతో పాటు రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యశోద పాఠశాల అకడమిక్ డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే డ్యాన్స్ పోటీలు

ధర్మవరం అర్బన్: విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకే డ్యాన్స్ పోటీలు నిర్వహించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి జయసింహలు తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నిరంతరం చదువే కాకుండా అప్పుడప్పుడు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల వారిలో నూతనోత్సాహం వస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో దేశభక్తి గీతానికి నృత్యం చేసిన కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. వారికి రోటరీ క్లబ్ సభ్యులు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, శివయ్య, బీవీచలం, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మెడల్స్ చూపుతున్న క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో గణతంత్ర దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ టోర్నీలో శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. బాలికల విభాగంలో కిరణ్మయి, సల్మా జట్లు ఫైనల్‌లో పోటీపడగా కిరణ్మయి జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో తరుణ్ జట్టు, మాధవ జట్టు పోటీపడగా తరుణ్ జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేతలకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, ఉపాధ్యక్షులు నిమ్మ చంద్రశేఖర్, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

ప్రజలకు ఏమి చేశారని పాదయాత్ర చేస్తున్నారు?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ముదిగుబ్బ: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి, ప్రజలకు మేలు చేయలేదు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందంటూ గొప్పలు చెప్పుకోవడం మినహా రాష్ట్రానికి ఏమి చేసింది లేదన్నారు. అలాంటి మాజీ ముఖ్యమంత్రి కుమారుడు లోకేష్ పాదయాత్ర చేస్తే ప్రజలు ఎలా ఆదరిస్తారన్నారని ప్రశ్నించారు. పాదయాత్ర చేస్తున్న లోకేష్‌ను కనీసం చూడడానికి కూడా ప్రజలు రారన్నారు. లోకేష్ పాదయాత్రను ఏదో విధంగా హైలెట్ చేసుకోవాలనే ఉద్దేశంతో అనవసరంగా పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకుల పైనా అభాండాలు వేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రాయుడు, శ్రావణ్‌కుమార్, పనగాని రాజు తదితరులు పాల్గొన్నారు.